కలుషిత నీరే దిక్కు!



బావి నీటిలో వచ్చిన పాకురు, పురుగులు



బావి వద్ద తాగునీరు తోడుకుంటున్న ప్రజలు

- తాగునీటి బావుల్లో క్లోరినేషన్ చేపట్టని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని అప్పాల వారీ వీధిలో ప్రజలకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. ప్రజలకు కలుషిత నీటినే తాగు నీటిగా ఉపయోగించుకుంటున్నారు. తమ ఇబ్బందులను పట్టించుకునే నాథుడే కరువయ్యారని గ్రామస్తులు వాపోతున్నారు. అప్పాలవారి వీధిలో గల గ్రామ పంచాతయతీ తాగు నీటి బావిలో అధికారులు క్లోరినేషన్ చేపట్టడం లేదని తెలుపుతున్నారు. దీంతో నీరు కలుషితమై నీటితో పాకులు, చిన్న చిన్న పురుగులు వస్తున్నాయని ఆదివారం బావి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. బావిలో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులకు, మండల పరిషత్ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లిన పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకువెళ్లిన స్పందించడం లేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా తక్షణమే అధికారులు స్పందించి పంచాయతీ ఆధ్వర్యంలోని తాగు నీటి బావుల్లో క్లోరినేషన్ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

సీసీ కెమెరాలతో ప్రజలకు రక్షణ

ఏటూరునాగారం: మండల వ్యాప్తంగా 36 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రజలకు పూర్తి రక్షణ కల్పిస్తున్నట్లు ఎస్సై తాజుద్దీన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ శబరిశ్, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సీఐ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పోలీస్ వ్యవస్థను ఇంకా పటిష్ట పరచడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలో 36 కెమెరాలతో అనునిత్యం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో కొత్త వ్యక్తులు కనిపించిన వారికి ఆశ్రయం ఇచ్చిన నేరంగా పరిగణించబడుతుందన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయించినట్లు తెలిస్తే వెంటనే సీసీ కెమెరాలు ద్వారా వారిని గుర్తించి పోలీస్ శాఖ అదుపులోకి తీసుకోనునట్లు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన శీలం రేణుక కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతూ కిడ్నీ సమస్యతో అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. దీంతో ఆర్థిక సాయం కోసం దాతల సహకారంతో బ్లడ్ డోనర్స్ నిర్వాహకుడు తడక సుమన్ ఆదివారం మండల కేంద్రంలో శీలం రేణుక కుటుంబ సభ్యులకు రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ డోనర్స్ మెరుగు హరీష్, బచ్చు సతీష్, గండేపల్లి సుకేష్, మల్యాల పవన్, మహమ్మద్ మున్నా, మహమ్మద్ అజాహార్, జానపట్ల సుమ, రుకమోద్దీన్, పిట్టల గణేష్, సంతోష్, విష్ణు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

మంగపేట: మండలంలోని కమలాపురం బిల్టు ఫ్యాక్టరీలో స్క్రాప్ పనుల నిర్వహణ కోసం వీధి వ్యాపారుల నుంచి అక్రమంగా కరెంటు కనెక్షన్ తీసుకుని విద్యుత్‌ను వాడుకున్న రాదా స్టీల్ కంపనీ యజమాన్యంపై ట్రాన్స్‌కో అధికారలు తక్షణమే చర్య తీసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుదుముల లక్ష్మీ నారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమంగా విద్యుత్‌ను వాడకుంటున్న విషయం తెలిసినా ట్రాన్స్‌కో అధికారులు చర్య తీసుకోకుండా మొదటి సారని చూసీ చూడనట్లు వదిలేయడాన్ని ఆయన తప్పుపట్టారు. రెండో సారి మళ్లీ అక్రమంగా విద్యుత్‌ను వాడుతున్న విషయం తెలిసిన ఏఈ తన సిబ్బందితో తనిఖీ చేసేందుకు వెళ్లగా ఫ్యాక్టరీలోకి వెళ్లకుండా రాదాస్టీల్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు అడ్డుకోవడం, సంఘటనను కవరేజ్ చేసేందుకు వెళ్లిన మీడియాపై దౌర్జన్యానికి దిగడం సరైన పద్ధతి కాదన్నారు. స్టీల్ కంపనీ సిబ్బందిమని చెప్పి కంపనీకి వత్తాసు పలుకుతు, మీడియాపై దౌర్జాన్యానికి దిగిన కాంగ్రెస్ పార్టీ నాయకులపై పోలీసులు చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పథకాల అమలులో దేశం అగ్రగామి

శాయంపేట : అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందిస్తూ భారతదేశం అగ్రగామిగా నిలిచిందని బీజేపీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశీధర్‌రెడ్డి అన్నారు. శాయంపేట గ్రామంలో సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇంటింటికి వెళ్లి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని మోదీ విశ్రాంతి లేకుండా దేశ ప్రజల కోసం పనిచేస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. ప్రతీ ఒక్క భారతీయుడు బీజేపీకి అండగా నిలవాలని కోరారు. అనంతరం ప్రధాని మోదీ ప్రతి నెల ఆదివారం నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని మండల నాయకులతో కలిసి వీక్షించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 2008-09లో పదవతరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. కాళేశ్వరంలోని ఎస్ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఒక్క చోట కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్, నాగరాజు, శ్రీనాథ్, హనుమంతు, సాయి, నూర్, శ్రీనివాస్, రమ్య, షాజహాన్, కల్యాణి, శృతి, స్వప్న, రమేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కుమారస్వామి సేవలు మరువలేనివి



ములుగు: కేక్ కట్ చేస్తున్న సూర్య, నాయకులు



మంగపేటలో..

ములుగు/ఎస్ఎస్‌తాడ్వాయి/మంగపేట: కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు దివంగత నల్లెల కుమారస్వామి పార్టీకి చేసిన సేవలను మరువలేనివని పలువురు నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం ఎదుట యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సూర్య, ఎస్ఎస్ తాడ్వాయి, మంగపేటలో మండల అధ్యక్షులు దేవేందర్, మైల జయరాంరెడ్డి ఆధ్వర్యంలో కుమారస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో, వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

కుమారస్వామి మృతి పార్టీకి తీరనిలోటు

నల్లెల కుమారస్వామి లేని లోటు కాంగ్రెస్ పార్టీని తీరలేనిది అని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు ఆదివారం సీతక్క హైదరాబాద్ నుంచి నల్లెల కుటుంబ సభ్యులతో ఫోన్ మాట్లాడారు. ములుగు ప్రాంతంలో నల్లెల తెలంగాణ ఉద్యమనేతగా గొప్పపేరును సంపాదించారని అన్నారు.

నూతన భవనం నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జూనియర్ కాలేజీకి నూతన భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు కొసరు వంశి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాల ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్న విద్యార్థులకు తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాగే కళాశాల సమయంలో విద్యార్థుల కోసం బస్సును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్, సాయిరామ్, చందు తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొగుళ్లపల్లి: మండలంలోని కోర్కిశాల గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో గంటల ప్రాతిపదికన ఆంగ్లమాధ్యమంలో బోధించుటకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తాళ్లపల్లి రాకేశ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీటీ బోధించుటకు పీజీ బీఈడీ, టీజీటీ బోధించుటకు బీఈడీ టెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నేడు(సోమవారం) ఉదయం 10:00 గంటల లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని అదే రోజున నిర్వహించే డెమో క్లాస్‌కు ఒరిజినల్ సర్టిఫికేట్‌తో హాజరు కావాలని తెలిపారు.

నియామకం



లక్ష్మణ్, అధ్యక్షుడు

చిట్యాల: చిట్యాల గౌడ సంఘం అధ్యక్షుడిగా బుర్ర లక్ష్మణ్‌ను నియమించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని జీపీ కార్యాలయం ఆవరణలో ఆది వారం నూతన కమిటీ ఎన్నిక ని ర్వహించారు. ఉపాధ్యక్షుడిగా పేరుమాండ్ల రాజు, డైరెక్టర్లుగా గుర్రపు రాజేందర్, అముదాలపల్లి శ్రీని వాస్, బుర్ర నరేష్, బుర్ర రాజ్‌కుమార్ ఎన్నికైయ్యారు.

నేడు సర్వసభ్య సమావేశం

కాటారం: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం నేడు (సోమవారం) చైర్మన్ తోటపల్లి ప్రశాంత్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు సీఈఓ ఎడ్ల సతీశ్ ఆవివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంఘం లావాదేవీలు, నిధులు, ఖర్చులు, చేపట్టబోయే అభివృద్ధి పనుల, తీర్మానాలపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. పాలకవర్గ సభ్యులు, రైతులు సకాలంలో హాజరై సమావేశం విజయవంతం చేయాలని సీఈఓ కోరారు.

నేడు పీఏసీఎస్ మహాజన సభ

మల్హర్: మండలంలోని తాడిచర్ల సహకార సంఘం కార్యాలయంలో నేడు(సోమవారం) పీఏసీఎస్ మహాజన సభ నిర్వహిస్తున్నట్లు సీఈఓ సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ ఇప్ప మొండి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి సొసైటీ సభ్యులు, రైతులు పాల్గొని విజయంతం చేయాలని కోరారు.

ముందస్తు బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ సంబురాల్లో ఉపాధ్యాయులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని గ్రీన్‌వుడ్ ఇంగ్లీష్‌మీడియం ప్రైవేట్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబురాలను విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆదివారం పాఠశాలలో రంగురంగుల బతుకమ్మలను పూలతో పేర్చి బతుకమ్మ ఆటాపాటలతో అలరించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి శంకరయరయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల కరస్పాండెంట్ చీర్ల శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం చీర్ల శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ ఆకుటతోట రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా ఐక్యంగా ఉండాలి



పూజలు చేస్తున్న ఎస్సై తాజొద్దీన్

ఏటూరునాగారం: కులమతాలకు అతీతంగా అందరూ ఐక్యంగా కలిసి ఉండాలని ఎస్సై తాజుద్దీన్ అన్నారు. మండల కేంద్రంలోని రామాలయం వీధిలో గల గ్రామ దేవత ముత్యాలమ్మకు నూతన వస్త్రాలతో పాటు మంగళసూత్రాలను అందించి ఎస్సై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వారి సంస్కృతి సంప్రదాయాలకు కట్టుబడి ఉండాలని తెలిపారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ముత్యాలమ్మ గుడి నిర్మాణానికి సహాయ సహకారాలు అందించిన ఎస్సైని పలువురు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రతన్ కుమార్, కొండాయి రమేష్, దుర్గం శ్రావణ్, నగేష్ దుర్గం, దుర్గారావు, గణేష్, కన్నేశ్వర రావు, సునార్కాని శ్రీను, కొండ గొర్ల దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

ములుగు/ములుగు రూరల్: జిల్లా కేంద్రంలో జంపన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం జిల్లా కేంద్రంలో హైదరాబాద్ శంకర్ కంటి ఆస్పత్రి సహకారంతో వైద్య శిబిరం భూక్య జంపన్న నిర్వహించారు. వైద్య శిబిరానికి జిల్లా నలుమూలల నుంచి 425 మంది హాజరయ్యారు. వైద్య పరీక్షలు నిర్వహించి 80 మందికి కంటి శస్త్ర చికిత్సలకు చారిటి ఆధ్వర్యంలో బస్సు సౌకర్యం కల్పించి హైదరాబాద్‌కు తరలించారు. మిగతా వారికి సమస్యకు అనుగుణంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జంపన్న మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధులు కంటి చూపు సరిగా లేక ఇబ్బందులు పడుతున్న విషయం గమనించి ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించామని అన్నారు. కంటి పరీక్షలకు హాజరైన వైద్యుడు ప్రణయ్, వైద్య బృదం, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు గుండారపు రాజు, అన్నారపు నాగార్జున, రాజ్‌కుమార్, కొడపాక మహేందర్, నాజర్, విక్రమ్, శ్రీనివాస్, సాగర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం.. ఇద్దరిపై కేసు



గుడుంబాను చూపిస్తున్న పోలీసులు

వాజేడు: గుడుంబాను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రుద్రారపు హరీశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కోయ వీరాపురం గ్రామ సమీపంలో 163 నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ సమయంలో మండలంలోని గుమ్మడిదొడ్డికి చెందిన కారం లక్ష్మిరామ్, చెరుకూరుకు చెందిన మాద నాగేశ్వరరావు ద్విచక్రవాహనంపై వెళుతూ తమను పారిపోతుండగా పట్టుకుని తనిఖీ చేసినట్లు తెలిపారు. కాగా, వారి వద్ద రూ.48,000 విలువ చేసే 120 లీటర్ల గుడుంబా లభించినట్లు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని తాళ్లగూడెం గ్రామం నుంచి తీసుకువస్తున్నట్లు తెలినట్లు పేర్కొన్నారు. గుడుంబా, ద్విచక్ర వాహనంను స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చెత్తను తొలగిస్తున్న కార్యదర్శి షగీర్‌ఖాన్

కాటారం: గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్ అన్నారు. కాటారం గ్రామపంచాయితీ పరిధిలో ఆదివారం పంచాయతీ కార్మికులు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాన రహదారులపై, పలు కాలనీల్లో చెత్తా చెదారం తొలిగించడంతో పాటు మురుగునీటి కాల్వలను శుభ్రపర్చారు. ఈ కార్యక్రమంలో కారోబార్ శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాల పేరుతో బలవంతపు వసూళ్లు



మాట్లాడుతున్న నాయకులు

కాళేశ్వరం: ప్రభుత్వ పథకాల ఆశ చూపి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామాల్లో సభ్యత్వ నమోదు చేస్తూ మహిళల నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, కాళేశ్వరం గ్రామశాఖ అధ్యక్షుడు నగునూరి రమేశ్ గౌడ్ అన్నారు. ఆదివారం కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. డబ్బులు చెల్లించకపోతే పథకాలు వర్తించవని చెప్పి మహిళల నుంచి రూ.100 రుసుముగా తీసుకొని, పార్టీ సభ్యత్వాలు సేకరించడం సిగ్గుచేటన్నారు. మహిళల నుంచి బలవంతపు వసూలు చేసి, కాంగ్రెస్ నాయకులు మహిళలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ డైరెక్టర్ ఒగేష్ గౌడ్, మేకల సురేష్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పెండ్యాల ఆనందం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మధు

కాటారం: మండలంలోని గుమ్మాళ్లపల్లికి చెందిన తడండ్ల పోచయ్య, కొలుగూరి రాజయ్య, కొత్తపల్లిలో మృతి చెందిన పాగె మల్లయ్య, మద్దులపల్లిలో మృతి చెందిన గడ్డం మల్లమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను ఆదివారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించి మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. అలాగే మండల కేంద్రంలో పెండ్యాల ఆనందం ప్రథమ వర్ధంతి కాగా బాధిత సభ్యులను పరామర్శించారు. గుమ్మాళ్లపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న కంకణాల రాజిరెడ్డిని పరామర్శించారు. పుట్ట మధు వెంట బీఆర్ఎస్ నాయకులు జక్కు రాకేశ్, జోడు శ్రీనివాస్, నరివెద్ది శ్రీనివాస్, కొండ గొర్ల వెంకటస్వామి, జక్కు శ్రావణ్, దుర్గారావు, రాజబాబు తదితరులు ఉన్నారు.

‘సీసీ’ నీడలో పల్లెలు

- గ్రామస్తుల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్న పోలీసులు
- తగ్గుతున్న నేరాల సంఖ్య



రంగాపురంలో సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు, పోలీసులు (ఫైల్)

మొగుళ్లపల్లి: నేరాల నియంత్రణకు మండల పోలీసులు నడుం బిగించారు. శాంతి భద్రతలో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రజల సహకారంతో గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామాల్లో నేరాల సంఖ్య అదుపులోకి వచ్చింది. ఆకతాయి దూకుడు, వాహనాల అతివేగం తగ్గింది. అసాంఘిక కార్యకలాపాలు అదుపుతోకి వస్తున్నాయి. గ్రామాల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇస్తున్నాయి.

నిఘా నీడలోని గ్రామాలు

మండలంలోని రంగాపురం, మొట్లపల్లి, మొట్టుపల్లి, వేములపల్లి, గుడిపహడ్, పోతుగల్లు మొగుళ్లపల్లి, గణేష్‌పల్లి గ్రామాల్లో గ్రామస్తుల సహకారంతో పోలీసులు సీసీ కెమోరాలను ఏర్పాటు చేశారు. సీఐ మల్లేష్, ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తు ఏర్పాటు చేయిస్తున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు నియంత్రించవచ్చని పోలీసులు తెలుపుతున్నారు. ఏవరైనా నేరాలకు పాల్పడితే సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించవచ్చని రోడ్డు ప్రమాదలు, జరిగిన ప్రమాదలకు గల కారణాలను తెలుసుకోవచ్చని పేర్కొంటున్నారు. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

అందరి సహకారంతో ఏర్పాటు



మండలంలో పూర్తి స్థాయి నిఘా ఏర్పాటు చేసేందుకు గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు తోడ్పాటును అందిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. అందరి సహకారం కావాలి.

– అశోక్ ఎస్సై, మొగుళ్లపల్లి

కార్మికులను బెదిరిస్తున్న ‘మత్స్య సొసైటీ’

శాయంపేట : చలివాగు ప్రాజెక్టు సొసైటీ నూతన పాలకవర్గం చలివాగు ప్రాజెక్టును కాంట్రాక్టర్‌కు ఇవ్వాలంటూ కార్మికులను ఇబ్బంది పెడుతున్నారని మత్స్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆదివారం మత్స్యకార్మికులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మండలంలోని పెద్దకోడెపాక రెవెన్యూ శివారులోని మధ్యతరహా చలివాగు ప్రాజెక్టులో 13 గ్రామాల మత్స్య కార్మికులు చేపలు పట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. చలివాగు ప్రాజెక్టు చైర్మన్ గండి రాజమౌళి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రాజెక్టు చెరువును కాంట్రాక్టర్‌కు ఇవ్వాలంటూ లేకుంటే మీ సభ్యత్వాలు రద్దు చేస్తానంటూ బెదిరిస్తున్నారన్నారు. ఆదివారం పెద్ద మనుషుల సమావేశం అని పెద్దమనుషులకు నోటీసులు పంపి చేపలు పట్టని నాలుగు గ్రామాల పెద్ద మనుషులతో కాంట్రాక్టు ఇస్తామంటూ సంతకాలు తీసుకున్నారని తెలిపారు. 10 ఏళ్ల క్రితమే కాంట్రాక్టర్ పద్ధ తిని రద్దు చేశారని మళ్లీ చైర్మన్ కాంట్రాక్టర్‌కు ఇవ్వాలంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు.